# మట్టి గణపతులతో పర్యావరణ పరిరక్షణక పాటుపడండి

## -జిల్లా కలెక్టర్ టి.ఎస్.చేతన్



మట్టిగణపతులను పంపిణీ చేస్తున్న జిల్లా కలెక్టర్ టి.ఎస్.చేతన్

**పుట్టపర్తి, సెప్టెంబర్ 05, ప్రభాతవార్త**

మట్టి గణపతులను ప్రతిష్టించుకొని పూజించుకోవడం ద్వారా నిమజ్జనం సమయంలో ఎలాంటి కాలుష్యం కలగకుండా పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ టి.ఎస్.చేతన్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక కలెక్టరేట్ ఆవరణంలో జిల్లా పర్యావరణ అనుకూల వినాయక చవితి అవగాహనకార్యక్రమం మట్టి వినాయకుడిని పూజిద్దాం, పర్యావరణాన్నికాపాడుదాం అనే నినాదంతో ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి తరపున తయారు చేసిన మట్టి గణపతి విగ్రహాలను జిల్లా కలెక్టర్ టి.ఎస్.చేతన్ చేతుల మీదుగా ప్రత్యేక కౌంటర్ ద్వారా ప్రజలకు ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మట్టితో తయారు చేసిన గణపతిని పూజించడం ద్వారా చవితి విశిష్టతను పెంచేలా మనమందరం సమిష్టిగా కృషి చేయాలని, సహజరంగులు తయారుచేసి మట్టివినాయక విగ్రహాలనుపూజించాలని కోరారు. కృత్రిమంగా తయరుచేసే గణపతి విగ్రహాల్లో ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో పాటు జిప్సం, గంధకం, మెగ్నీషియం వంటి హానికర రసాయనాల ద్వారా తయారు చేసిన గణపతులను నిమజ్జనం చేయడం ద్వారా పర్యావరణానికి ఎంతో ప్రమాదం సంభవిస్తోందన్నారు. ముఖ్యంగా జలవనరులు కలుషితమై నాణ్యత తగ్గడంతో పాటు, వృక్ష, జంతు జీవనంపై ప్రభావం కలుగుతోందన్నారు. ఆ నీటిని మనం వినియోగించడం ద్వారా ఊపిరితిత్తుల సమస్యలు, చర్మవ్యాధులు,రక్తం, కంటికి సంబంధించిన వ్యాధులుతదితర సమస్యలు ఉత్పన్నమౌతున్నాయన్నారు. కావున విగ్రహాల తయారీకి సహజసిద్ధమైన రంగులను, ప్రకృతితో తయారయ్యే పత్తి, నార వంటి పదార్థాలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాలుష్యనియంత్రణ మండలి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విశ్లేషణలతో సరిపెట్టకుండా లోతైన విచారణ చేయండి

## -మాతాశిశు మరణాలపై జిల్లా కలెక్టర్ సమీక్ష



మాతా శిశుమరణాలపై సంబంధిత అధికారులకు దిశనిర్దేశ్యం చేస్తున్న జిల్లా కలెక్టర్ టి.ఎస్.చేతన్


**పుట్టపర్తి,సెప్టెంబర్ 05, ప్రభాతవార్త**

జిల్లాలో మాతా శిశుమరణాలపై విశ్లేషణలతో సరిపెట్టకుండా లోతైన విచారణ చేపట్టాలని, మాతా, శిశుమరణాలకు గల కారణాలు తెలుసుకొని వాటిని అరికట్టాలని శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ టి.ఎస్.చేతన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని మీ కోసం సమావేశ మందిరంలో జిల్లాలో సంభవిస్తున్న మాతా శిశు మరణాలకు గల కారణాలపై ఆయా ప్రాంతాల వైద్యాధికారులు, సిబ్బందితో డిఎంహెచ్‌ఓ మంజువాణి, డిసిహెచ్ఎస్ తిపేంద్రనాయక్, ఐసిడిఎస్ పిడి నాలక్ష్మిలతో కలసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, బిడ్డ మృతి చెందిన, తల్లి మృతి చెందిన ఆ కుటుంబానికి తీరని వేదన మిగులుతుందని, మాతా శిశుమరణాలు జరుగుతున్న ప్రతి సారీ సమీక్షించుకుంటున్న మరణాల సంఖ్య తగ్గకపోవడం విచారకరమన్నారు. వైద్యశాఖలో అన్ని సదుపాయాలు కల్పించినా తీరు మారడం లేదని, అక్టోబర్ 2023 సంవత్సరం నుండి జూన్ 2024 సంవత్సరం వరకు జిల్లాలో 5 మాతృమరణాలు, 32 శిశు మఱణాలు సంభవించడం దారుణమన్నారు. ప్రతి మరణానికి గల కారణాలను క్షుణ్ణంగా విశ్లేషించి సరైన వివరణ ఇవ్వని వైద్య సిబ్బందికి నోటీసులు ఇవ్వాలని డిఎంహెచ్‌ఓ, డిసిహెచ్‌ఓలను ఆదేశించారు. సిహెచ్‌సిలలో రోగులను పరీక్షించేందుకు ఫిజికల్ రిపోర్టులను ఇవ్వాలని, వైద్యసిబ్బందిని ఆదేశించారు. వైద్యాధికారులు, ఎఎన్ఎంలు, ఆశావర్కర్లు, ఐసిడిఎస్ శాఖల మధ్య సమన్వయం చేసేందుకు రెగ్యులర్ కార్యకలాపాలపై వైద్యాధికారులు అందరితో సమావేశం నిర్వహించాలన్నారు. మినిట్స్ సమర్పించి రాబోయే సమావేశంలో మాతా శిశుమరణాలకు సంబంధించి వైద్యాధికారులందరికీ ప్రతి కేసుకు 3 స్లైడ్‌లు సిద్ధం చేయాలని, ఆ కారణాలను పేర్కొనడం ఎలా జరిగింది,చివరకు కేసుల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలో సూచించారు. డిఎంహెచ్‌ఓ ఆమోదం తరువాత స్లయిడ్‌లను ఖారారుచేయాల్సి ఉందన్నారు. అనంతరం గర్భిణీ స్త్రీలు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వేయించుకోవాల్సి వన టీకాలు, రిజిస్ట్రేషన్లు, అవగాహన కార్యక్రమాలు తదతర విషయాలపై కులంకషంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, మెడికల్ ఆఫీసర్లు, ఎఎన్ఎంలు, ఆశావర్కర్లు, ఐసిడిఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఉద్యోగ బాధ్యతలకు సెలవే..పదవీ విరమణ

## -ఎస్‌ఎపిఎస్ జూనియర్ అసిస్టెంట్ నరసింహులుకు ఘన వీడ్కోలు

## -హాజరైన కాంగ్రెస్ పార్టీ నాయకులు కెటి శ్రీధర్, కళాశాల సొసైటీ చైర్మన్ అగిశం రంగనాథ్







పదవీవిరమణ చేసిన నరసింహులును సన్మానిస్తున్న ప్రముఖులు ,సమావేశంలో మాట్లాడుతున్న జాతీయ కాంగ్రెస్ నేత కెటి శ్రీధర్ , మాట్లాడుతున్న కరస్పాండెంట్ కెంపుల లక్ష్మినారాయణ

**గోరంట్ల, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త**

గోరంట్ల పట్టణంలోని ఎస్‌ఎపిఎస్ జూనియర్ కళాశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహించే నరసింహులు పదవీవిరమణ సందర్భంగా జరిగిన కార్యక్రమాలు నయనానందకరంగా మారాయి. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకులు కెటి శ్రీధర్, శ్రీవీరబ్రహ్మం ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ అగిశం రంగనాథ్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. కళాశాలలో జరిగిన సన్మాన కార్యక్రమానికి ఎఎన్‌కె డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ కెంపుల లక్ష్మినారాయణ, ఎస్‌ఎపిఎస్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సూర్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో కెటి శ్రీధర్, కెంపుల లక్ష్మినారాయణ మాట్లాడుతూ కళాశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహించిన నరసింహులు సేవలు మరువలేనివన్నారు. అనంతరం నరసింహులును శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించి మెమెంటో అందచేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ వైస్‌ప్రెసిడెంట్ శశికళ, సెక్రటరీ డికె శ్రీనివాసులు, పెనుకొండ నియోజకవర్గంనకాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ పాలసముద్రం నరసింహులు, ప్రిన్సిపాల్ భక్తవత్సలం, కళాశాల అధ్యాపకులు రమేష్, రామకృష్ణ, రామాంజినేయులు, సిబ్బంది జ్ఞాన కళావతి, సుధాకర్, శివ, బాబు, జయప్రకాష్, నరసింహులు, ధనంజయ, నర్సరీ శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

# బహుజన చైతన్య వేదిక ఆధ్వర్యంలో గురుపూజోత్సవం

## - ఉపాధ్యాయులను సన్మానించిన సంస్థ అధ్యక్షులు, హైకోర్టు లాయర్ శివరామకృష్ణ

**గోరంట్ల, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త**

భాధ్యతాయుతమైన సమాజ నిర్మాణంలో యువతను భాగస్వామ్యం చేస్తున్న ఉపాధ్యాయులను గురుపూజోత్సవం సందర్భంగా వారిని సత్కరించాలనే ఆలోచనతో విద్యార్థులు మంచి నైపుణ్యాన్ని పెంచిన ఉపాధ్యాయులను గుర్తించి వారిని బహుజన చైతన్య వేదిక అధ్యక్షులు, హైకోర్టు లాయర్ శివరామకృష్ణ ఆధ్వర్యంలో పాలసముద్రంలోని హైస్కూల్‌లో 23 మంది ఉపాధ్యాయులను ప్రధానోపాధ్యాయురాలు మంజుల అధ్యక్షతన ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారికి జ్ఞాపికలు అందచేసి శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా శివరామకృష్ణ మాట్లాడుతూ భవిష్యత్తులో అనేక మంది విద్యార్థులు 590పైగా మార్కులు సాధించాలని, విద్యతో పాటు వివిధ అంశాలపై సృజనాత్మకమైన ఆలోచనలు వుండాలని విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అభ్యసించాలని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో చైతన్య వేదిక ప్రధాన కార్యదర్శి పెనుకొండ రవికమార్, గౌరవసలహాదారులు మునిమడుగు నరసింహులు, సీనియర్ నాయకులు రంగేపల్లి కదిరప్ప, ఉపాధ్యక్షులు చల్లపల్లి ఈశ్వర్, గౌరవసభ్యులు బోయిలపల్లి వెంకటేశులు, అశోక్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న సంస్థ అధ్యక్షులు శివరామకృష్ణ

# విజయవాడ వరద బాధితులకు అండగా మేము సైతం..

**శెట్టూరు, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త**

శెట్టూరు మండలం లక్ష్మంపల్లి గ్రామ పంచాయితీలో జనసేన నాయకులు చేపట్టిన కార్యక్రామనికి విశేష స్పందన లభించింది. గత మూడు రోజుల నుంచి విజయవాడలో జరుగుతున్న విపత్తు చాలా బాధాకరం. అందుకు మా వంతు సహాయంగా లక్ష్మంపల్లి పంచాయితీ గ్రామ ప్రజలు స్వచ్ఛందంగా విరాళాలు ఇవ్వడం జరిగింది. రెండు రోజులు చేపట్టిన ఈ కార్యక్రమంలోమొదటిరోజుగా 6130 రూపాయల విరాళంగా సేకరించడం జరిగింది. రెండవ రోజు ఎర్రబోరుపల్లి, కంబాలపల్లి డోర్ టూ డోర్ జరుగును. ఈ మొత్తం విరాళాలను జనసేన కార్యాలయానికి పంపించి, అటు నుంచి సీఎం రిలీఫ్ ఫండ్‌కి చేరేలాగా చూస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమానికి వచ్చినటువంటి ప్రధాన కార్దయర్శి లక్ష్మణ్, ప్రభుకుమార్, రాజగోపాల్, శాంతప్ప, వెంకటేష్, వన్నూరప్ప, లోకేష్, వంశీ, గ్రామ ప్రజలు సహకరించడం జరిగింది.



విరాళాలను సేకరిస్తున్న దృశ్యం

# సీజనల్ వ్యాధులపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలి



అంగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

**రాయదుర్గం, సెప్టెంబర్ 05 ప్రభాతవార్త:**

సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అవగాహన కలిగి ఉండాలని స్వచ్ఛ రాయదుర్గం స్వస్థ రాయదుర్గం టీం, వైద్యాధికారి రమేష్, ఆరోగ్య విద్య బోధకుడు లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. రాయదుర్గం పట్టణంలోని వాల్మీకి నగర్‌లలో ప్రజలకు అంటూ వ్యాధులపై, దోమల నిర్మూలలపై వారు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గోమల పుట్టకుండా కుట్టకుండా చూసుకునేందుకు ప్రజలు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. బహిరంగ మల విసర్జన వల్ల అంటు వ్యాధులు వ్యాపిస్తున్నాయని తెలిపారు. ఈగలు, దోమలు లేకుండా పరిశుభ్రత పాటించడం ద్వారా 90%అంటూ వ్యాధులను రాకుండా చూసుకోవచ్చునని చెప్పారు. ఈ కార్యక్రమంలో పరివేక్షికులు శాంతకుమారి, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆడకూతుర్ని రక్షిద్దాం... చదివిద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్లు

**రాయదుర్గం, సెప్టెంబర్ 05 ప్రభాతవార్త:**

ఆడ కూతుర్ని రక్షిద్దాం చదివిద్దామని, మహిళా జాతిని రక్షించుకోకపోతే సృష్టిలో మానవమనుగడ లేకుండా పోతుందని వైద్యాధికారి డాక్టర్ రమేష్ పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని కస్తూర్బా జూనియర్ కళాశాలలో బేటి బచావో బేటి పడావో కార్యక్రమాన్ని నిర్వహించి ఆడపిల్లలకు అవగాహన కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బాలిక విద్య అభివృద్ధి చెందకపోతే సమాజ అభివృద్ధి అసాధ్యమన్నారు. చిన్న వయసులో ఆడపిల్లలకు పెళ్లిళ్ల చేయడం వల్ల మాతా శిశు మరణాలు పెరిగిపోతున్నాయని, ఆరోగ్యవంతమైన జాతిని నిర్మించుకోవడం సాధ్యం కాదని ఆందోళన వ్యక్తం చేశారు. ఆడపిల్లలు బాగా చదువుకోవాలని కోరారు. ఆరోగ్య విద్య బోధకుడు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ కడుపులో ఉంటున్న ఆడపిల్లలకు కూడా రక్షణ లేకుండా పోతుందని స్కానింగ్ నిర్వహించి ఆడ శిశువు ఉందని గుర్తించి అబార్షన్ పేరుతో భ్రూహత్యకు పాల్పడుతున్నారని చెప్పారు. పిసిపిఎన్‌డిటి చట్టం ప్రకారం కడుపులో శిశువును లింగ నిర్ధారణ చేయడం చట్ట విరుద్ధమన్నారు. అలాంటివి జరిపితే స్కానింగ్ జరిపిన వైద్యులతో పాటు చేయించుకున్న తల్లిదండ్రులు ప్రోత్సమించిన వారు జరిమానా తోపాటు జైలు శిక్షకు అర్హులవుతారని చెప్పారు. బాలికల విద్య ద్వారా ఆర్థిక సాధికార రాజకీయ సాధికారత సాధ్యమవుతుందని, మహిళలపై అఘాయిత్యాలకు సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ వెంకటలక్ష్మి, ఆరోగ్య పర్యవేక్షులు శాంతికుమారి, లక్ష్మీ, హెల్త్ సెక్రెటరీలు, ఆశాలు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధుల పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న డాక్టర్

**గుమ్మఘట్ట, సెప్టెంబర్ 05 ప్రభాతవార్త:**

మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి డాక్టర్ బాలాజీనాయక్ మరియు డాక్టర్ సందేశ్ ఆధ్వర్యంలో ఏఎన్ఎంఎస్, ఎంఎల్‌హెచ్‌పిఎస్, హెల్త్ అసిస్లెంట్లకు, ఆశా వర్కర్లకు సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్లు మాట్లాడుతూ దోమల ద్వారా వచ్చే వ్యాధులు మలేరియా, డెంగ్యూ, చికెన్‌గున్యా, మెదడు వాపు వ్యాధి మరియు బోధ కాలు వ్యాధి లక్షణాలు వాటి నివారణ చర్యలు గురించి అవగాహన కల్పించామన్నారు. జాతీయయ నులిపురుగుల నిర్మూలనా కార్యక్రమం ఒక సంవత్సరం నుండి 19సంవత్సరాలలోపు పిల్లలకు సెప్టెంబర్ 17వ తేదీన పిల్లలకు ఆల్బండాజోలు మాత్రలు మిగించాలన్నారు. ట్యూబకో ఫోల్టర్స్ మరియు హెచ్‌ఐవి, ఎయిడ్స్ ఫోల్టర్స్ అన్ని సచివాలయం, హెల్త్ క్లినిక్స్‌కు పంపించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఓ మురళీధర్, సూపర్‌వైజర్ ఆది జయమ్మ, ఎఎన్ఎంఎస్, ఎంఎల్‌హెచ్‌పిఎస్, హెల్త్ అసిస్టెంట్స్, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

# వేపులపర్తిలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం



ఉపాధ్యాయ దినోత్సవం దృశ్యం

**బ్రహ్మసముద్రం సెప్టెంబర్ 05 ప్రభాతవార్త,**

మండంలోని వేపులపర్తి జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో గురావారం ఉపాధ్యాయుల దినోత్సవంను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంను ప్రదానోపాధ్యాయుడు రోషన్‌బాష అధ్యక్షతన డాక్టర్ సర్వేపల్లి రాధాక్రిష్ణ పుట్టినరోజును ఉపాధ్యాయుల దినోత్సవంగా ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 05 తేదిన జరుపుకొంటున్న కార్యక్రమం గురించి విధ్యార్థులకు వివరించి అయన అడుగుజాడల్లో ప్రతిఒక్కరూ నడవాలని విధ్యార్థులకు తెలియజేశారు.అనంతరం సీనియర్ ఉపాధ్యాయులైన రోషన్‌బాష, నాగేశ్వరరావులను తోటి ఉపాధ్యాయులు పూలమాల సాలువాతో సత్కరించారు.

# గదగజిల్లాలో ముఖాముఖిగా రెండు బైకులు ఢీకొని యువకుడు మృతి ముగ్గురికి గాయాలు

**గదగ,సెప్టెంబర్ 5,ప్రభాతవార్త ప్రతినిధి**

గదగజిల్లా ముండరగి తాలూకా హల్లిగుడి గ్రామంలో గురువారం ఉదయం రెండు మోటారు సైకిళ్ల ఎదురుబదురుగా ఢీకొనటంతో బైక్‌ను నడుపుతున్న వసంత చెన్నళ్లి (25) అనే యువకుడు అక్కడికక్కడె మృతి చెందగా మరోముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన యువకులను ముండరగి పెద్దాసుపత్రికి పోలీసులు చికిత్సకోసం చేర్చారు.

# ఘనంగా ఫ్రెషర్స్‌డే వేడుకలు

## - భావి భారత పౌరులుగా తీర్చి దిద్దేది ఉపాధ్యాయులే - కళాశాల అధ్యక్షులు



సమావేశంలో మాట్లాడుతున్న కళాశాల అధ్యక్షులు

**అగళి, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త**

అగళి కెజిఎ గుప్తా కళాశాలలో కొత్తగా చేరిన విద్యార్థులకు సీనియర్ విద్యార్థులు ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. వారిని సాదరంగా కళాశాలకు ఆహ్వానించారు. ఈ వేడుకల్లో ఫ్రెషర్స్‌డేతోపాటు ఉపాధ్యాయ దినోత్సవాన్ని సైతం నిర్వహించారు. రిటైర్డ్ ఉపాధ్యాయులు కళాశాల అధ్యక్షులను సన్మానించడంతోపాటు కళాశాలలో పని చేస్తున్న అధ్యాపకులను పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులను టీచర్స్‌డే సందర్భంగా కళాశాల యాజమాన్యం సన్మానించింది. ఈ సందర్భంగా కళ్శాశాల అధ్యక్షులు వీరన్న మాట్లాడుతూ.. భావి భారత పౌరులుగా తీర్చి దిద్దే బాధ్యత ఉపాధ్యాయుల భుజ స్కందాలపై ఉందన్నారు. పేద కుటుంబంలో పుట్టిన మాజీ ఉప రాష్ట్రపతి, రాష్ట్రపతి, ఉపాధ్యాయులు సర్వే పల్లి రాధాకృష్ణన్ జన్మదినాన్ని ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకోవడం వారు చేసిన సేవలకు నిదర్శనమన్నారు. సామాన్య టీచర్‌గా పని చేసి దేశంలో అత్యుత్తమ పదవి అయిన రాష్ట్రపతి పదవిని అనుభవించారంటే వారి ప్రతిభ ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. అలాంటి వార్శిగా ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు టీచర్లుగా, ఇంజినీర్లుగా, డాక్టర్లుగా, ప్రజా ప్రతినిధులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి శ్రీనివాస్‌మూర్తి, మాజీ ఆర్మీ, మాజీ సింగిల్ విండో అధ్యక్షులు కల్లప్ప, కోఆర్డినేటర్ శివప్ప, మాజీ సర్పంచు రవికుమార్, కరస్పాండెంట్ హనుమంతరాయప్ప, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ నాగేంద్రప్ప, హెచ్‌ఎం భద్రతప్ప, ట్రస్టీలు మాజీ సర్పంచు రవికుమార్, శేషాచలం, సత్యప్ప, కృష్ణప్ప తదితరులు పాల్గొన్నారు.

# పెళ్లికు ముందురోజు గుండెపోటుతో వరుడు మృతి

## - పెళ్లిపందిట్లో విషాదం

**చిక్కోడి ( బెళగావిజిల్లా ),సెప్టెంబర్ 5,ప్రభాతవార్త ప్రతినిధి**

బెళగావి జిల్లా చిక్కోడి పట్టణంలో గురువారం ఒక నవ వరుడు గుండెపోటుకు గురై మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు చిక్కోడి తాలూకా లోని ఐగళి గ్రామానికి చెందిన సదాశివ రామప్ప (31)కు శుక్రవారం ఒక యువతితో పెళ్లి కావాల్సి ఉండగా పెళ్లి కూతరు తరపునవారు అక్కడ పెళ్లికోసం భారీ ఎత్తున ఏర్పాట్లు చేస్తుంటే వరుడు సదాశివకు ఇవాళ ఉదయం ఉన్నట్టుండి తీవ్రమైన గుండెపోటు రాగా వరుడు స్థలంలోనే మృతి చెందాడు.దీంతో పాపం పెళ్లికూతురు ఇంట తీవ్రమైన విషాదం నెలకొంది.యువకుడుకు హఠాత్తుగా గుండెపోటుకు గురికావటంతో అతడిని రక్షించే అవకాశం లేకపోయింది.

# మండ్య జిల్లాలో ఇంటిగోడలు కూలి గృహిణి మృతి

**శ్రీరంగపట్టణ (మండ్యజిల్లా ),సెప్టెంబర్ 5,ప్రభాతవార్త ప్రతినిధి**

మండ్యజిల్లా శ్రీరంగపట్టణ తాలూకా నెలమనె గ్రామంలో గురువారం వేకువజామున కురిసిన భారీ వర్షాలకు ఒక ఇంటిగోడ కూలిపోయి గృహిణిఒకరు మృతి చెందారు.పోలీసులు తెలిపిన వివరాల మేరకు నెలమనె గ్రామానికి చెందిన శాంతమ్మ (55) అనే మహిళ రాత్రి కురిసిన వానలకు ఆమె ఇల్లు గోడలు కూలిపోగా గోడ శకలాల కింద గృహిణి చిక్కుకుని పోయి మృతి చెందింది.ఈప్రమాదంలో మరో ఇద్దరు వ్యక్తులు ప్రాణాలతో బయటపడ్డారు. గృహిణి మృతి చెందిన స్థలానికి ఆర్ఐ,గ్రామపంచాయతీ పిడివొ హాజరై పరిశీలించారు.

# చిన్నముష్టూరు ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో మీకు తెలుసా..? కార్యక్రమం

## -హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కల్పించిన చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ వర్కర్లు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**ఉరవకొండ, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త**

మండల పరిధిలోని చిన్నముష్టూరు గ్రామంలోగల ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో గురువారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ మీకు తెలుసా..? హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించింది. ఈ సందర్భంగా లింక్ వర్కర్ స్కీమ్ డీఆర్‌పీ రమేష్‌యాదవ్ మాట్లాడుతూ హెచ్‌ఐవీ, లైంగికంగా సంక్రమించే అంటు వ్యాధులు గుర్చి కులంకుశంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డి.ప్రశస్తకుమారి, ఇంచార్జ్ భాగ్యమ్మ, లింక్ వర్కర్లు నాగరాజు, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా గురుపూజోత్సవం

## -ప్రిన్సిపాల్ డా॥జి.రామకృష్ణను సన్మానించిన అధ్యాపకులు

**ఉరవకొండ, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త**



ప్రిన్సిపాల్ డా॥జి.రామకృష్ణను సన్మానిస్తున్న అధ్యాపకులు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా గురుపూజోత్సవం

పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం గురుపూజోత్సవం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డా॥జి. రామకృష్ణ ముఖ్య అతిధిగా హాజరై తొలుత భారత రెండవ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డా॥జి. రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు గురువులపట్ల ప్రేమ, అభిమానాలు కలిగి ఉండాలని, కళాశాలకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని కోరారు. కళాశాలకు నాక్ ఏ గ్రేడ్ వచ్చిందని విద్యార్థులందరూ కష్టపడి చదివి కళాశాలకు మరింత గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు ప్రిన్సిపాల్ డా॥జి.రామకృష్ణను షాలువాకప్పి పూలమాలతో ఘనంగా సన్మానించగా విద్యార్థులు అధ్యాపకులను సన్మానించి గురు భక్తిని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ టి.ఎన్.మస్తానప్ప, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ డా॥కె.ఎం.రాజేష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డా॥బి.వెంకటరాముడు, ఎన్.ఎ.అల్తాఫ్, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

06ATP27_06ATP27.qxd 05-09-2024 PM 10:56 Page 1



## నేడు పెనుకొండకు మంత్రి రాక...

### మహాత్మ జ్యోతిపూలే పాఠశాల ప్రారంభం...

**పెనుకొండ, సెప్టెంబర్ 05 ప్రభాతవార్త:**



రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేతజౌళి శాఖ మంత్రివర్యులు సవిత పట్టణాన్నికి విచ్చేయున్నారు. గత కొద్ది రోజులుగా రాష్ట్రంలలో కురుస్తున్న వర్షాల కారణంగా వరద బాధితులను పరామర్శిస్తూ బాధితులకు అండదండలుగా నిలుస్తూ వచ్చారు. వరద బాధితులు ఉపసాయనం కావడంతో ఆమె నియోజకవర్గ పరిధిలో పలు కార్యక్రమంలో పాల్గొన్నారు. శుక్రవారం ఆమ తండ్రి మాజీ మంత్రి వర్యులు స్వర్గీయ రామచంద్రరెడ్డి ఘాటు వద్ద నివాళులర్పించి తదనంతరం పట్టణంలో పాల్గొనను్నారు. రాంపురం వద్ద ఏర్పాటు చేయాలని మహాత్మజ్యోతీపూలే పాఠశాలను ప్రారంభించనున్నారు.

## సబ్సీడీపై ప్రత్యామ్నాయ విత్తనాలు పంపిణి

**బత్తలపల్లి, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త**

ఖరీఫ్ సీజనులో వేరుశనగ, కంది పంటలు సాగు చేయని రైతులకు ప్రభుత్వం సబ్సీడీపై ప్రత్యామ్నాయ విత్తనాలను అందిస్తోందని వ్యవసాయాధికారి ఓబిరెడ్డి తెలిపారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల కారణంగా పంటలు సాగు చేయని రైతుల కొరకు 80శాతం సబ్సీడీపై ఉలవలు, పెసలు,అలసందలు అందిస్తోందన్నారు. పంటలు సాగు చేయని రైతులకు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేందుకు ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. ఈ విత్తనాల కొరకు రైతు సేవా కేంద్రాలలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. పంటలు సాగు చేసిన తరువాత ఈ పంట నమోదు చేసుకోవాలన్నారు. ప్రభుత్వం సబ్సీడీ 80శాతం పోనూ ఉలవలు 10 కేజీలకు రూ. 174లు, పెసలు నాలుగు కేజీలు రూ. 104లు, అలసందలు 10కేజీలు రూ. 228లు రైతు సేవా కేంద్రాలలో చెల్లించాలన్నారు. అంతేకాకుండా ఖరీఫ్ సీజనులో రైతులు సాగు చేసిన పంటలను ఈ పంటను నమోదు చేసుకోవాలన్నారు.

## ఉపాధ్యాయులను సన్మానించిన జడ్పిటిసి

**అగళి, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త**



సన్మానిస్తున్న జడ్పిటిసి

సర్వే పల్లి రాధకృష్ణ జన్మదినాన్ని ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకుంటున్నాం. అగళి మండల జడ్పిటిసి ఉమేష్ తనకు విద్యా బుద్ధులు నేర్పిన గురువులను పూల హారాలతో దుశ్శాలువాలతో సత్కరించారు. మొదటి గురువు అమ్మ తర్వాత విద్యను నేర్పించడం గురువులే అని ఈ రోజు ఈ స్థాయిలో ఎదగడానికి గురువులే కారణం అన్నారు. గురువు నారాయణప్ప తదితరులను జడ్పిటిసి ఉమేష్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కన్వీనర్ కుమారస్వామి, ప్రధాన కార్యదర్శి జయరామ్, నాయకులు శివకుమార్, గురుమూర్తి, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు భూతరాజు తదితరులు పాల్గొన్నారు.

## గురు పూజోత్సవం సందర్భంగా విద్యార్థులకు బట్టలు పంపిణీ

**అగళి, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త**



దుస్తులను పంపిణీ చేస్తున్న దృశ్యం

ఇరిగేపల్లి ఉన్నత పాఠశాలతలో గురువుకు వందనం కార్యక్రమంలో భాగంగా టీచర్స్ దేను పురస్కరించుకుని క్రీడా పోటీలను నిర్వహించారు. క్రీడాపోటీల్లో పాల్గొని విజయం సాధించిన విద్యార్థులకు స్కూల్ పిల్లల స్నేహితుడు పాండురంగ పంపిన టీషర్టులను పంచాయితీ సర్పంచు లింగరాజు, సోదరుడు మంజు చరణ్, జనసేన కార్యదర్శి రఘు, టీచర్స్‌డే సందర్భంగా పిల్లలకు పంపిణీ చేశారు. భాగా కష్టపడి చదవడంతోపాటు క్రీడల్లో రాణించి ఊరికి మంచి పేరు తీసుకురావాలని సర్పంచు అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రవికుమార్, ఉపాధ్యాయులు కాటప్ప, రిటైర్డ్ ఉపాధ్యాయులు నారాయణప్ప తదితరులు పాల్గొన్నారు.

## పెనుకొండ అభివృద్ధికై కృషిచేస్తా....

### మున్సిపల్ కమీషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన గోరంట్ల శ్రీనివాసులు...



బాధ్యతలు స్వీకరిస్తున్న కమిషనర్ గోరంట్ల శ్రీనివాసులు

**పెనుకొండ, సెప్టెంబర్ 05 ప్రభాతవార్త:**

పట్టణ మున్సిపల్ కమీషనర్‌గా గోరంట్ల శ్రీనివాసులు గురువారం బాధ్యతలు చేపట్టారు. గతంలో పనిచేసిన వంశీకృష్ణ బార్గవ్ ఇటీవల బదిలీపై వెళ్లారు. గతంలో గుత్తి మున్సిపల్ కార్యాలయంలలో పనిచేస్తున్న శ్రీనివాసులు పెనుకొండకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ప్రభాతవార్తతో మాట్లాడుతూ పెనుకొండ అభివృద్ధికై కృషి చేస్తానని ఆయన తెలిపారు. పట్టణంలో డ్రైనేజీలు, సిసిరోడ్లు నెలకొల్పావలసిన అవసరం ఉందన్నారు. అందుకు సంబంధించిన ప్రతిపాదనలు తయారుచేసి ప్రభుత్వంకు ప్రతిపాదనలు పంపడం జరుగుతుందన్నారు. మంత్రి సవిత కృషితో ప్రభుత్వం చే నిధులు తీసుకొచ్చి అభివృద్ధి పరుస్తామన్నారు.

## గ్రామ పంచాయితీలకు పవన్ కళ్యాణ్ నిధులు ఇవ్వడం హర్షనీయం

**తాడిమర్రి, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త**



విలేకర్లతో మాట్లాడుతున్న సర్పంచు భూషణ్

వరద ప్రాంతాలను దృష్టిలో ఉంచుకుని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మానవత్వంతో తన సొంత నిధుల నుంచి రూ.4 కోట్లు విరాళంగా ఇవ్వడం హర్షనీయమని నిడిగల్లు సర్పంచు ఉభయ జిల్లాల సర్పంచుల సంఘం అధ్యక్షులు భూషణ్ హర్షం వ్యక్తం చేశారు. ఒక్కో పంచాయితీకి లక్ష చొప్పున నాలుగు కోట్ల రూపాయలను ఇవ్వడం హర్షనీయమన్నారు. ఈ నిధులతో గ్రామాభివృద్ధికి సర్పంచులు కృషి చేస్తారని ఆయన తెలిపారు. పవన్ కళ్యాణ్ విరాళంగా 4 కోట్లు ఇవ్వడం అంటే ఆశామాషీ విషయం కాదన్నారు. గ్రామ పంచాయితీల్లో నాలుగేళ్లుగా జగన్ ప్రభుత్వం 10 రూపాయలు కూడా కేటాయించకపోవడం గ్రామాభివృద్ధి కుంటుపడిందన్నారు. డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌కు సర్పంచుల సంఘం తరుపున కృతజ్ఞతలు తెలిపారు.

## శ్రీ సరస్వతీ విద్యామందిరానికి వాటర్ ఫిల్టర్ అందజేసిన దినేష్ కుమార్

**కళ్యాణదుర్గం, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త**

ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా శ్రీ సరస్వతీ విద్యామందిరానికి పట్టణంలోని శ్రీ రాఘవేంద్ర హోటల్ నిర్వాహకులు దినేష్ కుమార్ వాటర్ ఫిల్టర్ అందజేసారు. ఈ సందర్భంగా దాత మాట్లాడుతూ విద్యామందిరంలోని ఉపాధ్యాయులకు, విద్యార్థులకు సురక్షితమైన తాగునీటిని అందించాలనే లక్ష్యంతో వాటర్ ఫిల్టర్‌ను అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానాచార్యులు కరణం తిరుమలరావు,కమిటీ సభ్యుడు రంగనాథశర్మ తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయులు అవార్డు అందుకున్న తాటికొండ వెంకట్, ఎ.రాజేష్

### -జిల్లా కేంద్రంలో జరిగిన గురుపూజోత్సవంలో ఘన సన్మానం

**ఉరవకొండ, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త**



జిల్లా కలెక్టర్ తదితరుల చేతుల మీదుగా సన్మానం అందుకొంటున్న ఉపాధ్యాయుడు తాటికొండ వెంకట్

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన పట్టణంలోని జిల్లా పరిషత్ సెంట్రల్ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న తాటికొండ వెంకట్, వజ్రకరూరు మండలంలోని చాబాల గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సెకెండరీ గ్రేడ్ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న ఎ.రాజేష్ అవార్డులు అందుకున్నారు. జిల్లా కేంద్రం అనంతపురంలోని ఆర్ట్స్ కళాశాల డ్రామా హాల్‌లో గురువారం జరిగిన గురు పూజోత్సవం-2024 జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాల ప్రధానోత్సవం కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్, అనంతపురం పార్లమెంటు సభ్యులు అంబికా లక్ష్మినారాయణ, జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఎమ్మెల్సీ మంగమ్మ, అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తదితరుల చేతుల మీదుగా ఘన సన్మానం అందుకొని జ్ఞాపికలు పొందారు. ఈ సందర్భంగా తాటికొండ వెంకట్, ఎ.రాజేష్ మాట్లాడుతూ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక కావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అవార్డు తమకు మరింత బాధ్యతను పెంచిందని పేర్కొన్నారు.



కలెక్టర్ తదితరుల చేతుల మీదుగా సన్మానం అందుకొంటున్న ఉపాధ్యాయుడు ఎ.రాజేష్

## ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

### -భారతరత్న సర్వేపల్లి రాధాకృష్ణన్‌కు ఘన నివాళులు

**ఉరవకొండ, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త**



సాంఘిక సంక్షేమ బాలికల గురుకులంలో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు గురువారం ఘనం గా జరిగాయి. పట్టణంలోని శివరా మిరెడ్డి కాలనీలో గల డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకులంలో ప్రిన్సిపాల్ సునీత అధ్యక్షతన జరిగిన గురుపూజోత్సవ వేడుకల్లో భారతదేశ రెండవ ఉప రాష్ట్రపతి, భారతరత్న సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించి విద్యార్థులకు మిఠాయిలు పంచిపెట్టారు. వజ్రకరూరుమండలం పీసీపీ కొత్తకోట గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు గోవింద నాయక్ ఆధ్వర్యంలో జరిగిన గురుపూజోత్సవ కార్యక్రమంలో శ్రీ వివేకానంద ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్ (ఎస్‌వీఓఎస్‌ఏ) సభ్యులు శ్రీరాములు ఉపాధ్యాయులను షాలువాకప్పి పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఎస్ఎంసీ వైస్ ఛైర్మెన్ శోభ డొక్క సీతమ్మ చిత్రపటాలను పాఠశాల ఉపాధ్యాయులు రాజశేఖర్, చంద్రశేఖర్‌లకు అందించారు. ఈ కార్యక్రమంలో కమిటీ ఛైర్మెన్ అడివప్ప, ఉపాధ్యాయులు నాగేంద్ర, బాబు, శ్రీరాములు, రమాదేవి, వి.రాజశేఖర్, చంద్ర, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## మార్కెట్ యార్డులో వేప చెట్టుకు కారుతున్న కల్లు..!

### -వీరబ్రహ్మేంద్రస్వామి స్వామి చెప్పిన కాలజ్ఞానం జరుగుతోందంటున్న ప్రజలు

**ఉరవకొండ, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త**



వేప చెట్టు నుండి ధారగా కారుతున్న కల్లు

ఈత చెట్టుకో, తాటి చెట్టుకో కల్లు కారడం మనం చస్తుంటాం. అయితే ఉరవకొండ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులోగల వేప చెట్టుకు ధారగా కల్లు కారుతోంది. బుధవారం నుండి ఈ వింత కొనసాగుతోందని మార్కెట్ యార్డు సిబ్బంది చెబుతున్నారు. చెట్టు నుండి చిక్కటి తెల్లటి ద్రవం కారుతోందని దాని రుచి చూస్తే తియ్యగా ఉందని అంటున్నారు. అయితే ఇది గమనించిన స్థానికులు మాత్రం వీరబ్రహ్మేంద్రస్వామి కాలజ్ఞానంలో చెప్పినట్లు ఇప్పుడు జరుగుతోందని చెబుతున్నారు. వివరాల్లోకి వెళితే... గుంతకల్లు రోడ్డులోని వ్యవసాయ మార్కెట్ యార్డు ప్రధాన గేటుకు పక్కన దాదాపు ఆరేడు సంవత్సరాల వయసుగల వేప చెట్లు ఉన్నాయి. అందులోని ఒక చెట్టుకు బుధవారం నుండి కల్లు కారుతుండటం అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. చెట్టు పైభాగాన ఉన్నట్టుండి రంధ్రం ఏర్పడి అందులోంచి వేప కల్లు ధారగా కారుతోంది. విషయం తెలియగానే స్థానికులు ఆ వింతను చూసేందుకు పెద్దఎత్తున తరలివస్తున్నారు. వీరబ్రహ్మేంద్రస్వామి చెప్పినట్లు కలియుగంలో ఎన్నెన్నో వింతలు జరుగుతున్నాయని అందులో ఇదొకటని కొందరు చెబుతుండగా మరికొందరు వేప కల్లు ఆరోగ్యానికి మంచిదని, అనేక రోగాలు నయమవుతాయని, కళ్ల సమస్యలు పరిష్కారమవుతాయని కల్లును సిసాల్లో పట్టుకొంటున్నారు.

## బిజెపి సభ్యత్వ నమోదు ప్రారంభం

**తాడిమర్రి, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త**



సభ్యత్వ నమోదును నిర్వహిస్తున్న గోపాల్‌రెడ్డి

తాడిమర్రి మండలంలో బిజెపి సభ్యత్వ నమోదు గురువారం ప్రారంభించారు. ధర్మవరం అసెంబ్లీ నియోజకవర్గం కన్వీనర్ గంగల కుంట గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ.. బిజెపి అధజష్టానం ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ ఆదేశాల మేరకు తాడిమర్రి మండలంలో 6 వేలమందిక ఆర్యకర్తలను బిజెపిలోకి చేర్చడానికి ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. గ్రామాల్లో బిజెపి నాయకులు, కార్యకర్తలు ఇంటింటా ప్రచారం నిర్వహించి సభ్యత్వ నమోదును పూర్తిచేయాలని పంచాయితీ కన్వీనర్లను ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మండల బిజెపి ప్రచార కార్యదర్శి చంద్రమోహన్, రామాంజినేయులు, పోతులయ్య తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరామిరెడ్డి, సత్యసాయి తాగునీటి పథకాల కార్మికుల సమ్మె

### -పెండింగ్ జీతాలు, ఈఎస్ఐ చెల్లించి వివిధ సమస్యలు పరిష్కరించాలంటున్న కార్మికులు -5 నియోజకవర్గాల పరిధిలో 910 గ్రామాలకు పూర్తిగా నిలిచిపోయిన తాగునీటి సరఫరా

**ఉరవకొండ, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త**



పీఏబీఆర్‌లోని పంపింగ్ స్టేషన్‌వద్ద శ్రీరామిరెడ్డి కార్మికుల నిరసన కార్యక్రమంలో పాల్గొన్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు

శ్రీరామిరెడ్డి, సత్యసాయి తాగు నీటి పథకాల కార్మికులు నిరవధిక సమ్మెబాట పట్టారు. పెండింగ్ జీతాలు, ఈఎస్ఐ చెల్లించి వివిధ సమస్యలను పరిష్కరించాలన్న డిమాండ్‌తో సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం అర్థరాత్రి నుండి పీఏబీఆర్‌లోని పంప్‌హౌసుల్లో నీటి పంపింగ్‌ను నిలిపివేసి విధులను బహిష్కరించి ఆందోళన కొనసాగిస్తున్నారు. రెండు స్కీముల పరిధిలో దాదాపు 1,000 మంది కార్మికులు సమ్మె బాట పట్టడంతో ఉమ్మడి అనంతపురం జిల్లాలోని ఉరవకొండ, రాయదుర్గం, కళ్యాణదుర్గం, మడకశిర, హిందూపురం నియోజకవర్గాల పరిధిలోని 910 గ్రామాలకు తాగునీటి సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. గురువారం పీఏబీఆర్‌లోని ఆయా పథకాల పంప్‌హౌసలవద్ద కార్మికులు సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు, జిల్లా అధ్యక్షులు నాగేంద్ర ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికులు పేస్-1కు 5 నెలల జీతాలు, పీఎఫ్, 18 నెలలు ఈఎస్ఐ వెంటనే చెల్లించాలని, క్యూసి, క్యూఎ ప్రతిపాధనలు అమలు చేయరాదని, ఫేస్-4కు సంబంధించిన కార్మికుల 8 నెలల జీతాలు, 20 నెలల పీఎఫ్ చెల్లించాలని, కాంట్రాక్టు విధానం రద్దుచేసి కార్మికులను రెగ్యూలర్ చేయాలని, కార్మికులపై రాజకీయ వేధింపులు, తొలగింపులు ఆపాలని, ప్రజలకు తాగునీటిని ఉచితంగా అందించాలని, నీటి మీటర్లు బిగించరాదని, స్కీమ్‌ను కాపాడాలని డిమాండ్ చేశారు. సత్యసాయి కార్మికులు 6 నెలల జీతాలు, పీఎఫ్, ఈఎస్ఐ వెంటనే చెల్లించాలని, క్యూసి. క్యూఎ ప్రతిపాదనలు అమలు చేయరాదని, గతంలో సమ్మె చేసిన సందర్భంగా ఒప్పందాల అంశాలను అమలు చేయాలని, సమాన పనికి సమాన వేతనం అందించాలని, కాంట్రాక్టు విధానం రద్దుచేసి కార్మికులను రెగ్యూలర్ చేయాలని, కార్మికులపై రాజకీయ వేధింపులు, తొలగింపులు ఆపాలని, ప్రజలకు తాగునీటిని ఉచితంగా అందించాలని, నీటి మీటర్లు బిగించరాదని, స్కీమ్‌ను కాపాడాలని డిమాండ్ చేస్తున్నారు.

## బూదగవి ఉపాధిహామీ పథకం పనుల్లో అక్రమాలు వాస్తవమే..!

### -క్షేత్రస్థాయిలో ఫారమ్ పాండ్ పనులను ఎంపీడీఓ తనిఖీ చేయగా తేటతెల్లం -బినామీ కూలీల పేర్లతో కాజేసిన రూ.40వేలు కట్టేందుకు క్షేత్ర సిబ్బంది అంగీకారం

**ఉరవకొండ, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త**



బూదగవి గ్రామస్థుల సమక్షంలో ఉపాధిహామీ ఏపీఓ, టీఏ తదితరులను విచారిస్తున్న ఎంపీడీఓ జి.సి.రామచంద్ర

మండల పరిధిలోని బూదగవి గ్రామంలో జరిగిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లో అక్రమాలు వాస్తవమేనని స్పష్టమైంది. రెండు ఫారమ్ పాండ్ పనుల్లో 15 వందికిపైగా బినామీ కూలీల పేర్లతో కాజేసిన కూలి మొత్తం 40వేల రూపాయలను తిరిగి ప్రభుత్వానికి చెల్లించేందుకు క్షేత్ర సిబ్బంది ముందుకొచ్చారు. వివరాల్లోకి వెళితే.. 'వార్త'లో ఈనెల 1వ తేదీన "బూదగవిలో జరిగిన ఫారమ్‌పాండ్ పనుల్లో అక్రమాలు..!" అన్న శీర్షికన ప్రత్యేక కథనం వెలువడిన క్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ సి.చిరంజీవి తదితరులు అక్రమాలపై సమగ్ర విచారణ జరుపాలని పలు ఆధారాలతో డ్వామా పీడీను కలిసి విన్నవించిన విషయం తెలిసిందే. ఈక్రమంలోనే గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పిర్యాదుదారుల సమక్షంలో ఎంపీడీఓ జి.సి.రామచంద్ర ఉపాధిహామీ ఏపీఓ విమల, టెక్నికల్ అసిస్టెంట్ శ్రావణి తదితరులను విచారించారు. దీంతో చనిపోయినవారి పేర్లతోపాటు సంవత్సరాలుగా కదలకుండా మంచానపడ్డ వారు కూడా పనులు చేసినట్లు వారికి వారం, రెండు వారాల కూలిడబ్బులు చెల్లించినట్లు బినామీ కూలీల వ్యవహారం నిరూపణ కావడంతో సాయంత్రంలోగా 40వేల రూపాయలు కూలీ డబ్బులు డీడీ రూపంలో ప్రభుత్వానికి కట్టేందుకు క్షేత్ర సిబ్బంది అంగీకరించారు. అదేక్రమంలో ఫారమ్ పాండ్ పనులను పరిశీలించేందుకు ఎంపీడీఓ క్షేత్రస్థాయికు వెళ్లిన టీఏ చూపిన ఫారమ్‌పాండ్ పనులు ఎప్పుడో రెండు సంవత్సరాల క్రితం ఒకే వంకలో రెండు చోట్ల తూతూమంత్రంగా కాస్త మట్టి ఏత్తేసి ఎంబుక్కుల్లో రికార్డు చేసినట్లు బయటపడింది. ఈ విషయమై ఎంపీడీఓ జి.సి.రామచంద్ర మాట్లాడుతూ క్షేత్ర పరిశీలన, విచారణ నివేదికను డ్వామా పీడీకు తదుపరి చర్యల నిమిత్తం పంపుతామని క్షేత్ర సిబ్బంది నుండి బినామీ కూలీల పేర్లతో చెల్లించిన డబ్బులు 40వేల రూపాయలు రికవరీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రస్తుత, రాజీనామా చేసిన ఎఫ్ఏ పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.



ఫారమ్‌పాండ్ పనుల జరిగినట్లు చెప్పబడుతున్న ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ జి.సి.రామచంద్ర

## ఆహారంలో పోషక విలువలు ఉండేలా చూసుకోవాలి

### - పౌష్టికాహార మాసోత్సవాల్లో ఆరోగ్య సిబ్బంది

**ఉరవకొండ, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త**



ఆమిద్యాల-2 అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో జరిగిన పౌష్టికాహార మాసోత్సవ కార్యక్రమం దృశ్యం

మనం తినే ఆహారం ముఖ్యంగా గర్భిణీలు, బాలింతలు, కిశోర బాలికలు పోషక విలువలు ఉండేలా చూసుకోవాలని రాకెట్ల పీహెచ్‌సీ సీహెచ్ఓ నాగరంగయ్య, హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ షఫీ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రబియాసూచించారు. మండలపరిధిలోని ఆమిద్యాల గ్రామంలోని 2వ అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో గురువారం పౌష్టికాహార మాసోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజలకుపౌష్టికాహారం గూర్చి అవగాహన కల్పించారు. నిత్యం సమతుల ఆహారం తీసుకోవాలని, ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, మాంసాహారం, గుడ్లు తీసుకోవాలని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే పోషకాహార కిట్లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వ్యక్తిగత శుభ్రత పాటించాలని ఐరన్ పోలిక్ మాత్రలు వాడాలని, బాల్య వివాహాలు అనర్థదాయకమని తద్వారా బాలికల్లో అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని వివరించారు. అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార ప్రదర్శన ఆకర్షించింది. అంతకుముందు గ్రామంలో పీసీ పీఎన్‌డీటీ చట్టంగూర్చి అవగాహనకల్పించారు. ఈకార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శేఖర్, సీహెచ్ఓ భవాని, ఏఎన్ఎం చాముండేశ్వరి, అంగన్‌వాడీ వర్కర్లు నాగవేణి, ఆశ కార్యకర్తలు అమీన, తులసమ్మ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీసరస్వతీ విద్యామందిరంలో గణిత విజ్ఞానమేళా



బహుమతులను అందచేస్తున్న దృశ్యం

**గుంతకల్లు, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త**

పట్టణంలోని మిల్లుకాలనీలోని శ్రీసరస్వతీ విద్యామందిరం పాఠశాలలో గురువారం ఉమ్మడి అనంతపురం జిల్లా విభాగస్థాయి గణిత విజ్ఞానమేళా నిర్వహించారు. గణిత, సైన్స్ విభాగంలో 11 అంశాలకు సంబంధించి సబ్‌జూనియర్స్, సీనియర్స్ విద్యార్థులు పాల్గొనగా సైన్స్, ఫీడ్ మ్యాథ్స్, సంస్కృతిజ్ఞాన క్విజ్ పోటీలను మూడు స్థాయిల్లో నిర్వహించగా ఇందులో సబ్‌జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ విద్యార్థులు పాల్గొన్నారు. 26 పాఠశాలల నుండి 276 మంది విద్యార్థులు పాల్గొనగా 114 మంది విద్యార్థులు ప్రతిభ కనబరిచి బహుమతులు గెలుచుకున్నారు. బహుమతులను వాసవి పైపుల అధినేత ఎస్.రామ్మోహన్‌గుప్తా సహకారంతో అందచేశారు. ఈ బహుమతులను దామోదరగుప్తా, విసి నరసింహులు, నాగసురేంద్రరెడ్డి, నారాయణస్వామి, అశ్వర్థమ్మ, శ్రీనివాసులు, సురేష్‌గౌడ్‌లు అందచేశారు.

## సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి

### - రూరల్ ఎస్ఐ రాఘవేంద్రప్ప

**గుంతకల్లు, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త**



ఎస్ఐ రాఘవేంద్రప్ప

మండలంలోని సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు రూరల్ సిఐ రాఘవేంద్రప్ప పేర్కొన్నారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఆయన గురువారం ప్రభాతవార్తతో మాట్లాడారు. ఆయా గ్రామాల పరిస్థితులను తెలుసుకుని అక్కడ ఎలాంటి అలజడులు చోటు చేసుకోకుండా చూస్తామన్నారు. ప్రస్తుతం వినాయక ఉత్సవాలు జరగనున్న నేపథ్యంలో విగ్రహాల ఏర్పాటుకు ప్రతి ఒక్కరు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు జరుపుకోవాలన్నారు. అసాంఘిక కారక్రమాలపై ప్రత్యేక నిఘా వుంచుతామని ఎస్ఐ పేర్కొన్నారు.

## వేతనాలు చెల్లించాలని కార్మికుల ర్యాలీ

**గుత్తి, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త**



కార్మికులు ర్యాలీ చేస్తున్న దృశ్యం

గత ఆరు నెలలుగా బకాయి వున్న తమ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ గురువారం సిఐటియు ఆధ్వర్యంలో సత్యసాయి నీటి ప్రాజెక్ట్ కార్మికులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కార్మికులకు క్యూఎ నివేదిక రద్దు చేయాలని, పిఎఫ్, ఇఎస్ఐ బకాయిలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు మల్లేష్, నిర్మల, కార్మిక సంఘం నాయకులు బాష, కృష్ణమాచారి, నాగరాజు, రామాంజినేయులు, నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

**గుత్తి, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త**



రిటైర్డ్ టీచర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

గుత్తి, గుత్తిఆర్ ఎస్, గ్రామీణ ప్రాంతాల్లోని అన్ని విద్యానంధ్లల్లో గురువారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పెన్షనర్ల కార్యాలయంలో 80 సంవత్సరాలు దాటిన రిటైర్డ్ ఉపాధ్యాయులు రంగారెడ్డి, మాబుసా, జయజీవనమ్మ, మహెబూబ్‌లను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్టేట్‌బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ నాగార్జునరెడ్డి, సంఘం నాయకులు అబూబకర్, కుళ్లాయిబాబు, రామ్మోహన్, సర్వాంభ, తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి

**గుత్తి, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త**



టిడిపి ఇన్‌చార్జ్ నారాయణ మాట్లాడుతున్న దృశ్యం

నేటి సమాజంలో మహిళలు స్వయం ఉపాధి ద్వారా ఆర్థిక స్వావలంబన సాధించి కుటుంబానికి చేయూతగా వుండాలని టిడిపి గుత్తి ఇన్‌చార్జ్ గుమ్మనూరు నారాయణ, సిడిపిఒ ఢిల్లీశ్వరి పేర్కొన్నారు. ఐసిడిఎస్ ఆధ్వర్యంలో జనశిక్షణా సంస్థాన్ పర్యవేక్షణలో చెట్నేపల్లిలోని ఆర్డీటి పాఠశాలలో గురువారం మహిళలకు బ్యూటీషియన్, టైలరింగ్ అంశాల్లో శిక్షణా శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం నలుగురు గర్భవతులకు శ్రీమంతం నిర్వహించి 3 వేల రూపాయల చొప్పున వారికి అందించారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కో ఆర్డినేటర్ రషీద్, సూపర్‌వైజర్ నాగేశ్వరి, జయలలిత, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీకృష్ణుని గ్రామోత్సవం

**గుత్తి, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త**



రథంపై శ్రీకృష్ణుని విగ్రహాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

గుత్తి పట్టణంలో గురువారం త్రైత సిద్ధాంతం ప్రభోద సేవాసమితి హిందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శ్రీ కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా అలంకరించిన రథంపై శ్రీకృష్ణుని విగ్రహాన్ని ఉంచి పట్టణంలోని పుర వీధుల్లో ప్రదర్శన గావించారు. జిల్లా వ్యాప్తంగా పెద్దఎత్తున భక్తులు తరలిరావడంతో ప్రదర్శన కోలాహలంగా జరిగింది. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన వేషదారణ, సాంస్కృతిక కార్యకమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ ర్యాలీలో కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న మాస్టారు

**- కళ్యాణదుర్గం ఎమ్మెల్యే సైతం ప్రశంసలు - తన పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు తాను ఆక ఆదర్శగా నిలిచిన వ్యక్తి**





వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న దృశ్యాలు, ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు చేతులు మీదుగా సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు

**శెట్టూరు, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త**

మండలంలోని మాకొడికి జడ్పిహెచ్ఎస్‌లో హిందీ పండితులుగా పని చేస్తున్న బద్దేనాయక్ తన జీవితంలో ఎన్నో ఒడిదుడుకులు అనుభవించి తాను చదువుకున్న సమయంలో పడ్డ కష్టం.. తన జీవితంలో అనుభవించిన పేదరికం.. ఎవరూ అనుభవించకూడదని తనకు తోచిన సాయం చేస్తూ అందరితో ప్రశంలందుకొంటున్నాడు. కళ్యాణదుర్గం మండలం పి.వెంకటాపురం గ్రామం లో వెంకటనాయక్-లక్ష్మిబాయి దంపతుల కుమారుడు బద్దేనాయక్. కన బాల్యం విద్యాభ్యాసమంతా తన పుట్టిన గ్రామంలోనే పూర్తి చేసి తర్వాత హై స్కూల్ విద్యాభ్యాసమంతా కంబదూరు మండలం తిమ్మాపురం ప్రభుత్వ పాఠశాలలో చదువుతూ అక్కడే హాస్టల్‌లో ఉండి చదువుకున్నారు. తర్వాత ఇంటర్ చదువు కళ్యాణదుర్గం ప్రభుత్వ కళాశాలలో మంచి మార్కులతో పూర్తి చేసి డిగ్రీ జిల్లా కేంద్రంలో ఆర్ట్స్ కళాశాలలో చదువుకున్నారు. తర్వాత పై చదువులు పీజీ ఎస్వీ యూనివర్సిటీ తిరుపతిలో పూర్తి చేశారు. 2012 సంవత్సరంలో హిందీ పండితులుగా ఉద్యోగం సాధజంచారు. నిరుపేద గిరిజన కుటుంబంలో జన్మించిన మాస్టారు తాను పడ్డ కష్టం తనను చదివించేందుకు తన తల్లిదండ్రులు పడ్డ కష్టాన్ని కళ్లారా చూసిన మాస్టారు. ఎక్కడ కూడా తనపై తల్లి దండ్రులు కుటుంబ సభ్యులు నమ్మకాన్ని వమ్ముచేయకుండా ఉద్యోగం అనే గమ్యాన్ని చేరుకున్నారు. ఉద్యోగం చేస్తున్న సమయంలో తనకు ఒక వికలాంగుడు కనిపించాడు రెండు చేతులు లేని ఆ వికలాంగుని చూసి మాస్టారు తన కోసం ఏదైనా చేయాలని తన జీతంలోని కొంత మొత్తాన్ని ఆ వికలాంగునికి అందజేశారు. అప్పుడు, ఆ వికలాంగుడు మాస్టారుకి చేతులెత్తి దండం పెట్టేందుకు తనకు రెండు చేతులు లేవని కృతజ్ఞథలు తెలియజేశాడు. అప్పుడు ఆ మాటలు విన్న మాస్టారు ఇప్పటి నుంచి తనకు వచ్చే జీతంలో సగభాగం ఇక మీదట సేవ భావానికి కేటాయించాలని నిర్ణయించుకున్నాడు. తన నిర్ణయాన్ని తన కుటుంబ సభ్యులకు తెలియజేయగా ఆ కుటుంబ సభ్యులు ఎంతో సంతోషించి తనకు సపోర్టుగా నిలిచారు. అప్పటి నుంచి మాస్టారు ప్రతిరోజు తన జీవితంలో ఎవరికైనా ఒకరికి సహాయం చేయాలని ఆలోచనతో ముందుకు సాగారు. తన మిత్రుల ద్వారా చాలా వరకు సహాయం కూడా అందింది. చదువుకి పేదరికం అడ్డు రాకూడదు అన్న ఏకైక లక్ష్యంతో ముందుకు సాగిన మాస్టారు ఎంతో మందిని ఉన్నత చదువులకు చేదోడుగా నిలిచారు. దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతున్న అభాగ్యులకు నేనున్నానని చేయూతనిచ్చారు ఇలా చెప్పుకుంటూ పోతే ఒకటి రెండు మూడు చాలా మందికి చాలా రకాలుగా సహాయం చేశాడు. కళ్యాణదుర్గం ప్రాంతానికి కాకుండా అనంతపురం, ధర్మవరం, కదిరి ప్రాంతాల్లో ఉన్న వారికి కూడా స్నేహితుల ద్వారా తెలుసుకొని అక్కడికే వెళ్లి సహాయం చేశారు. గత వైఎస్ఆర్‌సిపి ప్రభుత్వ ఉత్తమ సేవ ఉపాధ్యాయుడి అవార్డును మాస్టారుకు అప్పటి మంత్రి పెద్దిరెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు. తన మిత్రులు తన స్నేహితులు తన ఆప్తులు అందరూ కలిసి ఒక ట్రస్ట్ ఏర్పాటు చేసి ఇక మీదట ఆ ట్రస్ట్ ద్వారానే తన సేవా కార్యక్రమాలను చేయాలని సూచించారు. చెప్పిందే తడువుగా ఒక ట్రస్ట్‌ను ఏర్పాటు చేసి ఆ ట్రస్టు ద్వారా ఎంతో మందికి సేవలను అందిస్తున్నారు. ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్ట్. ట్రస్ట్ ద్వారా ఎంతో మంది విద్యార్థులకు విద్యకయ్యే ఖర్చులను, దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతున్న వారికి సహాయం చేస్తున్నారు. ఈ మధ్య కాలంలో మండలంలోని ఐదు కల్లు గ్రామంలో తల్లి, తండ్రిని కోల్పోయిన అనాధ పిల్లలు అని శీర్షికను చదివిన మ ఆస్టారు వెనువెంటనే తన స్నేహితులను వెంటపెట్టుకొని ఆ గ్రామానికి వెళ్లి ఆ అనాధ పిల్లలకి మేమున్నామని భరోసా నివ్వడమే కాకుండా ఆ ముగ్గురు పిల్లల చదువుకు అయ్యే ఖర్చులను తాను ట్రస్టు భరిస్తుందని గ్రామ పెద్దలకు తెలియజేశారు. ఇప్పుడున్న కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబుని తమ ట్రస్టు కార్యాలయానికి ఆహ్వానించి స్థానిక ఎమ్మెల్యే చేతులు మీదుగా 11 మంది అనాధలకు సహాయం అందించారు.

## ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం



ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

**కుందుర్పి, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త**

కుందుర్పి మండల పరిధిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠవాలలో కలిగులిమిలో ప్రధానోపాధ్యాయులుగా గురువారం అనంతపురం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డు గ్రహీతలుగా ఎనినక కాబడిన కుందుర్పి మండల పరిషత్ ప్రాథమిక కలిగులిమి పాఠశాలలో పని చేస్తున్న ఎస్ఎల్ఎన్ ప్రసాద్, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల అల్లాపురంలో పని చేస్తున్న ఈశ్వరమ్మ, మండల పరిషత్ వడ్డే పాలెంలో ఎస్‌జిటి పని చేస్తున్న గోవర్ధన్‌లను రాష్ట్ర ఉపాధ్యాయులుగా సంఘం జిల్లా శాఖ, కుందుర్పి మండల శాఖ తరుపున ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అనంతపురంజిల్లా అధ్యక్షులు రమణారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్యుడు, రాష్ట్ర ఆహ్వాన కమిటీ సభ్యులు కె.కృష్ణమూర్తి, జిల్లా కార్యదర్శి రాధాకృష్ణ, రాజు, జిల్లా నాయకులు ఆర్.సుబ్బరామప్ప, జయరాం ప్రధాన కార్యదర్శి రేవన్న నాయకులు మల్లికార్జున, మంజునాథ్, ఎల్లప్ప, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కొత్త చేనేత పట్టు సహకార సంఘం ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతిచ్చింది

**- హ్యాండ్లూమ్ ఏడి రమేష్**



హ్యాండ్లూమ్ ఏడి రమేష్

**ధర్మవరం, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త**

శ్రీ సత్యసాయి జిల్లాలోని చేనేత కార్మికులకు మాస్టర్ వీవర్లకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం వారు కొత్త చేనేత పట్టు సహకార సంఘాల ఏర్పాటుకు అనుమతి లభించిందని హ్యాండ్లూమ్స్ ఏడి రమేష్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధిలో గల 50 మంది చేనేత అండ్ పట్టు కార్మికులతో గ్రామీణ ప్రాంతములలో చుట్టుపక్కల 50 మంది క ంటే తక్కువ ఉన్నచో కనీస 30 మంది చేనేత, పట్టు కార్కిఉలతో ఒక కొత్త చేనేతపట్టు సహకార సంఘమును ఏర్పాటు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. అందువల్ల సంఘ సభ్యులు ఉత్పత్తి చేసిన ఉత్పత్తులను రాష్ట్ర జాతీయస్థాయి ఎగ్జిబిషన్ అనగా వస్త్ర ప్రదర్శనలో అమ్ముకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ధర్మవరం పట్టు చీరలు ఉత్పత్తి చేయువారు దరఖాస్తు చేసుకోవలసినదిగా వారు తెలిపారు. కావున జిల్లాలోని చేనేత కార్మికులు కొత్త సంఘం ఏర్పాటు ప్రతిపాదనలు శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తిలోని దిగిన జనార్దరణ కాంప్లెక్స్ వెస్ట్ గేట్ దగ్గర ఉన్న జిల్లా చేనేత జౌళి శాఖ అధికారి కార్యాలయమునకు అందజేయాలని తెలిపారు.

## ప్రారంభమైన వినాయక చవితి వేడుకలు

**బెలుగుప్ప, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త**




ఆలయ గోపురంపై కలిశం ప్రతిష్ట చేస్తున్న దృశ్యం , హోమాలు నిర్వహిస్తున్న దృశ్యం

మండల కేంద్రంలో వినాయక చవితి వేడుకల్లో భాగంగా గురువారం వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించి అభిషేకాలు నిర్వహించి బ్రాహ్మణుల చేత గణపతి హోమం, నవగ్రహ హోమం, పూర్ణాహుతి హోమం లాంటివి నిర్వహించారు. అందులో భాగంగా వేద మంత్రాలతో వినాయకుని ఆలయ గోపురం కలిశ ప్రతిష్టను ఆలయ కమిటీ సభ్యుల చేత నిర్వహించారు. ఈ వేడుకలు ఐదు రోజులు నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అనంతరం వచ్చిన భక్తాదులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

**హిందూపురం టౌన్, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త**




వీరభద్రప్పను సన్మానిస్తున్న దృశ్యం

హిందూపురం మండల వ్యాప్తంగా గురువారం ఉపాధ్యాయ దినత్సోవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు హిందూపురం పట్టణంలోని బాలాజీ డిగ్రీ కళాశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ వీరభద్రప్పను విద్యార్థులు సన్మానించి ఆశీర్వాదాలు తీసుకున్నారు. అదేవిధంగా రూరల్ చౌలూరు గ్రామంట హిందూపురం అప్‌గ్రేడ్ సిఐ ఆంజనేయులు ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి గ్రామానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకరావాలని విద్యార్థులను ఆశీర్వదించారు. అనంతరం గ్రామానికి చెందిన జనసేన నాయకులు ఏర్పాటు చేసిన పెన్నులు, బుక్కులు, విద్యాసామాగ్రిని సిఐ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ టీచర్ తిప్పేస్వామి, సోము, అశ్వర్థ, రవి, చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

## వినాయక ప్రతిష్టాపన పై సూచనలు...

**డి.హీరేహాళ్, సెప్టెంబర్ 05 ప్రభాతవార్త:**



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్

డి.హీరేహాళ్ మండల కేంద్రంలో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో వినాయక మంతపాలు నిర్మించుకునే వారికి తహసీల్దార్ మారుతి ప్రసాద్ తగు సూచనలు, సలహాలు అందించారు. ఈ సందర్భంగా డి.హీరేహాళ్ మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో ఆయన వినాయక మంతపాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కళ్యాణదుర్గం రెవెన్యూ డివిజన్ వారి ఆదేశాల మేరకు ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వినాయక ప్రతిష్టాపన జరుపుకోవడానికి మంతపాలను నిర్మించువారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ రఘునాథ్, పంచాయితీ అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా గురుపూజోత్సవ వేడుకలు

**అమరాపురం, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త**



గురుపూజోత్సవ వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం



కస్తూరిబా పాఠశాలలో వేడుకలు

మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో గురువారం గురుపూజోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండలంలోని ఆదర్శపాఠశాల, కస్తూరిబా గాంధీ, బాలికల గురుకుల పాఠశాల, అమరాపురం ఎంఇఓ కార్యాలయం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, శ్రీసాయి విద్యానికేతన్, వాసవిపాఠశాల, సరస్వతీ విద్యామందిరం, ఎంజిఎం పాఠశాల, జెకె పాఠశాల, తదితర పాఠశాలల్లో గురుపూజోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్బంగా మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎంఇఓ కార్యాలయంలో ఎంఇఓ టి.రాఘవయ్య ఆధ్వర్యంలో ఉపాధ్యాయు లు సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కెజిబివి పాఠశాలలో ఎస్ఒ శోభారాణి ఆధ్వర్యంలో ఆదర్శపాఠ శాలలో ప్రిన్సిపాల్ ఓబులపతి ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా గురువు యొక్క ప్రాముఖ్యతను వివరించడంతో పాటు సమాజం అన్ని విధాల అభివృద్ధి సాధించాలంటే గురువు యొక్క పాత్ర కీలమైందని శ్రీసాయి విద్యానికేతన్ పాఠశాల కరస్పాండెంట్ నాగోనపల్లి మంజునాథ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి సిహెచ్ హనుమంతరాయప్ప, అడ్మినిస్ట్రేషన్ అధికారి పిజె తిప్పేస్వామి సమక్షంలో కేక్ కట్ చేశారు. అదేవిధంగా ఉపాధ్యాయులను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు.

## గురువులు బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులతో సమానం

**-ఉరవకొండ లయన్స్‌క్లబ్‌లో ఘనంగా గురుపూజోత్సవం**



అధ్యాపకులు, ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించిన లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

**ఉరవకొండ, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త**

గురువులు బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులతో సమానమని వారిని ప్రతిఒక్కరూ గౌరవించాలని వక్తలు పేర్కొన్నారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలో క్లబ్ స్టడీ, యోగ కేంద్రంలో గురువారం గురుపూజోత్సవంను ఘనంగా నిర్వహించి దివంగత మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు ప్రసాద్‌రెడ్డి, మహాత్మా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ బసవరాజు, ఎస్ఎల్ఎన్ కాలనీ ఉర్దూ పాఠశాల హెచ్‌ఎం కుమెయిల్ సాహెబ్, జెడ్పీ సెంట్రల్ ఉన్నత పాఠశాల పీడీ మారుతీప్రసాద్, ఇందిరానగర్ ఎంపీపీ స్కూల్ ప్రధానోపాధ్యాయులు ఉమను శాలువాకప్పి పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రాయిను రత్నంగా మార్చగలిగే శక్తి ఒక్క గురువులకు మాత్రమే ఉందని అలాంటి గురువులను జీవితాంతం గుర్తుంచుకొని పూజించాలన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ఉపాధ్యక్షులు యం.విశ్వనాథ్, రీజినల్ ఛైర్మెన్ పి.జి.ఎస్.నూర్‌మహమ్మద్, జోన్ ఛైర్మెన్ సప్తగిరి మల్లికార్జున, కార్యదర్శి బి.నగేష్‌బాబు, కోశాధికారి హెచ్.జాబీర్, సభ్యులు యేళ్ల ప్రభాకర్‌నాయుడు, టి.గణేష్‌బాబు, కె.బాలచంద్ర, జి.కె.శ్రీధర్, సి.నాగేశ్వరరావు, ఇ.శ్రీరాములు, బి.లక్ష్మినారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రారంభమైన అటల్ బిహారీ వాజ్‌పేయి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభోత్సవం

**ధర్మవరం, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త**

భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ఆరోగ్యశాఖ మంత్రి ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్‌ల పుట్టినరోజు సందర్భంగా, ధర్మవరం పట్టణంలోని ఆర్డిటి గ్రౌండ్‌లో అటల్ బిహారీ వాజ్‌పేయి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభోత్సవం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో మంత్రి సత్యకుమార్ యాదవ్ కార్యాలయ సిబ్బంది హరీష్, మల్లికార్జున పాల్గొని క్రీడాకారులతో గౌరవ వందనం స్వీకరించారు. తదుపరి గొట్లూరు, బడనపల్లి మధ్య తొలి క్రికెట్ మ్యాచ్‌కు టాస్ వేసి, టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా హరీష్ మాట్లాడుతూ.. క్రికెట్ టోర్నమెంట్ ప్రధానమైన అద్భుతమైన క్రీడా కార్యక్రమం, స్థానిక క్రీడా ప్రేమికులకు మరింత ఉత్సాహాన్ని, ఆనందాన్ని పొందుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు డోలా రాజారెడ్డి, అంబటి సతీష్, సాకే ఓబులేసు, ముదిగుప్ప ఎంపిపి ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

**-సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి ఘనంగా నివాళి**

**ఉరవకొండ, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త**



సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటంవద్ద నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా జరిగింది. ప్రిన్సిపాల్ ఎన్.మమత అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో భారత రెండవ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ప్రిన్సిపాల్ ఎన్.మమత మాట్లాడుతూ సర్వేపల్లి రాధాకృష్ణన్ దేశానికి తొలి ఉప రాష్ట్రపతిగా సేవలందించారని సోవియట్ యూనియన్‌లో దేశానికి రెండవ రాయబారిగా ఉన్నారన్నారు. ఆయన చేసిన సేవలకు గుర్తుగా 1954లో ఆయనకు భారత అత్యున్నత పౌరపురస్కారం లభించిందని వివరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్‌ను అధ్యాపకులు శాలువాకప్పి పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు ఖాధర్, శివప్రసాద్, సీనియర్ వృత్తి విద్య అధ్యాపకులు ప్రసాద్‌రెడ్డి, అధ్యాపకులు మధు, లక్ష్మినారాయణరెడ్డి, అనితమ్మ పాల్గొన్నారు.

## వినాయక పండుగను ప్రశాంతంగా జరుపుకోండి

**ధర్మవరం రూరల్, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త**



టూటౌన్‌సిఐ రెడ్డప్ప

పట్టణంలో వినాయక చవితి పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని టూ టౌన్ సిఐ రెడ్డప్ప తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు, గొడవలకు తావు ఇవ్వకుండా ఉండాలని తెలిపారు. బైకులకు సైలెన్సర్లు పీకి వేయడం, గట్టిగా అరవడం లాంటివి చేస్తే కఠినంగా వ్యవహరించాల్సి ఉంటుందని హెచ్చరించారు. అసాంఘీక కార్యకాలపాలకు పాల్పడని కూడా చర్యలు చెప్పవని తెలిపారు. కావున ప్రజలందరూ సహకరించాలని తెలిపారు.

## ఆంధ్ర వరద విపత్తును జాతీయ విపత్తుగా కేంద్రం ప్రకటించాలి

**-పెనుకొండ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ పాలసముద్రం నరసింహులు**

**గోరంట్ల, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త**



నియోజకవర్గం ఇన్‌చార్జ్ నరసింహులు

ఆంధ్రప్రదేశ్‌లో సంభవించిన విపత్తును కేంద్ర ప్రభుత్వం జాతీయ విపత్తుగా ప్రకటించాలని పెనుకొండ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ పాలసముద్రం నరసింహులు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు రాష్ట్రంలో లక్షలాది ఎకరాల్లో పంట నష్టం, ఆస్తినష్టం జరిగిందన్నారు. వేల కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. ఇంత జరిగినా ఎన్‌డికె కూటమిలో భాగస్వామ్య పక్షం అయిన బిజెపి ఇంతవరకు స్పందించలేదన్నారు. ప్రధాని నరేంద్రమోడి వెంటనే ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించి వరదలను జాతీయ విపత్తుగా పరిగణించి రైతుల యొక్క రుణాలు సంపూర్ణంగా రద్దు చేసి వరద బాధితులను ఆదుకోవాలని, రాష్ట్రానికి 30 వేల కోట్ల రూపాయల ఆర్థిక సాయం మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## ఆదర్శ విద్యాసంస్థల్లో గురుపూజోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ భక్తవత్సలం

**గోరంట్ల, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త**

స్థానిక శ్రీకృష్ణదేవరాయ జూనియర్ కళాశాల, ఎస్‌పివిఎం డిగ్రీ కళాశాలల్లో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా గురుపూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ భక్తవత్సలం, వక్తలు ప్రసంగిస్తూ సర్వేపల్లి రాధాకృష్ణన్ తెలుగు వారి అయి వుండి భారతదేశానికి మొదటి ఉపరాష్ట్రపతిగా రెండవ రాష్ట్రపతిగా ఎన్నికై దేశానికి ఎనలేని సేవలు అందించారన్నారు. ఆయన నాలుగు దశాబ్దాలుగా ఉపాధ్యాయ వృత్తిలో వుంటూ విద్యావిధానంలో ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చి విజ్ఞాన ఘని మరియు భారతరత్న పురస్కారాన్ని అందుకున్న గొప్ప తత్వవేత్త అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ పిఒలు ఆజాద్, రఘునాథరెడ్డి, బాలమోహన్, అధ్యాపకులు జునీద్‌బాషా, అరవింద్, కవిత, లక్ష్మి, శ్వేత, శాంతి, సుమలత, ఆర్షియ, రిజ్వానా, రామ్మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయుడిగా అరుణ్‌కుమార్




కలెక్టర్, ఎమ్మెల్యే చేతులు మీదుగా అవార్డు అందుకుంటున్న అరుణ్‌కుమార్

**కనగానపల్లి, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త**

ఉత్తమ ఉపాధ్యాయుడిగా అరుణ్‌కుమార్ ఎంపికయ్యారు. పుట్టపర్తిలో గురువారం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ చేతన్ అలాగే పుట్టపర్తి ఎమ్మెల్యే సింధూర రెడ్డి చేతుల మీదుగా ప్రశంస పత్రం అందుకున్నారు. ఈయన శివపురం కొట్టాల ఎస్జీటి ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. ఈ అవార్డు రావడం పట్ల మండల విద్యాశాఖ అధికారి అరుణమ్మ-1, ఉపాధ్యాయులు అభినందించారు.

## ఎల్ఐసి బీమా వారోత్సవాల ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

**హిందూపురం, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త**

హిందూపురం ఎల్ఐసి బీమా అవసరాల ఆవశ్యకతను ప్రజలకు వివరిస్తూ సీనియర్ బ్రాంచ్ మేనేజర్ హరిప్రసాద్, ఏబిఎన్ రామ్మూర్తి, డెవలప్‌మెంట్ అధికారులు ప్రసాద్, ఎల్ఐసి ఏజెంట్లు ఆధ్వర్యంలో ద్విచక్రవాహనాల ర్యాలీ గురువారం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాలసీ ఆవశ్యకతను వివరించారు.

## ఎకరాకు నెలకో లక్ష సంపాదన.."సేద్యం" సినిమా సందేశం

**-రాయలసీమ రైతుల అసలు కథే సేద్యం రియల్ స్టోరీ**

**-నేడు సేద్యం సినిమా విడుదల**

**గోరంట్ల, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త**




సమావేశంలో మాట్లాడుతున్న నిర్మాత సురేష్



సినిమా పోస్టర్‌ను విడుదల చేస్తున్న చిత్ర యూనిట్

సేద్యం సినిమా ఈ నెల 6వతేదీ జిఎంఎస్ గ్యాలరీ ఫిల్మ్స్ యూట్యూబ్ ఛానెల్‌లో సాయంత్రం 6 గంటలకు విడుదలకు సిద్ధంగా వున్నట్లు నిర్మాత పారిశ్రామిక వేత్త జిఎం సురేష్ అన్నారు. చిత్ర యూనిట్ గురువారం పాత్రికేయుల సమావేశం నిర్వహించి చిత్ర కథను వివరించారు. వ్యవసాయం చేయడానికి రైతులు ఎంతో కష్టపడ్డారో సేద్యం సినిమా చేయడానికి రెట్టింపు కష్టపడాల్సి వచ్చిందన్నారు. మేము తీసుకున్న ఈ సేద్యం సబ్జెక్ట్ మాకు చాలా ఛాలెంజింగ్ అనిపించింది. అర్థం కాని ఎన్నో సమస్యలను ఎదుర్కొన్నారు. ఈ విశ్వానికి అన్నం పెట్టే రైతున్నను పేపర్లలో కాదు ప్రపంచానికి పరిచయం చేయాలని గట్టి నిర్ణయం తీసుకున్నామన్నారు. గతంలో రైతులపై జరిగిన అన్యాయాలు, అమాయకంగా వాళ్లపై పెట్టిన కేసులు, అప్పుల బాధ తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్న రైతుల లిస్టు రెడీ చేసుకున్నామని అందులో భాగంగానే సినిమాను తెరకెక్కించామన్నారు. సేద్యం చిత్రం రైతుల కోసం మేము అందించిన గొప్ప బహుమతిగా భావిస్తున్నామన్నారు. ఈ సేద్యం చిత్రానికి దర్శకులుగా చంద్రకాంత్ పసుపులేటి, చాయాగ్రహకులు విష్ణువర్ధన్‌రెడ్డి గొరకాటి, నిర్మాతలుగా జిఎం సురేష్, మహేష్‌రెడ్డి గొరకాటి, గాజుల పద్మావతి, సహ నిర్మాతగా డాక్టర్ విజయ్‌పాల్‌రెడ్డి, నటీనటులు శ్రీనివాసులు పసుపులేటి, నీలరమణ, గాయత్రి రమణ, శ్రీనివాస్, కుషాల్‌తేజ, విద్యమధు, తరిమెల రాజు, గౌతం, మురళీధర్, అన్వేష్ వున్నారు. కొరియో గ్రాఫర్‌గా వినోద్, ఎడిటర్‌గా మిక్కి శ్రీనివాస్, సంగీతం ఎంసి పృథ్వీరాజ్, బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ అరుణ్‌కీన్, సహ దర్శకునిగా చేగువేరా హరిలు వున్నారు.

## వైభవంగా భగవద్గీత పారాయణం

**- శ్రీకృష్ణుడు జగన్నాథునికి ప్రత్యేక అభిషేకాలు, సంకీర్తనలు**

**అగళి, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త**

మండల కేంద్రమైన అగళి దత్తాత్రేయ స్వామి ఆలయంలో విజయవాడ, తిరుపతి నుంచి వచ్చిన ఇస్కాన్ టెంపుల్ నుంచి వచ్చిన పూజారులు ప్రత్యేకంగా అగళి మండలకేంద్రంలో శ్రీకృష్ణుని శరణ్ణాతుని జగన్నాథుని విగ్రహాలను ఊరేగించిన అనంతరం దత్తాత్రేయ స్వామి దేవాలయంలో సంకీర్తనలు, భజనలు, విగ్రహాకలు అభిషేకాలు, పంచామృతాభిషేకం, కాలిగ్రామ అభిషేకం అనంతరం మహా మంగళహారతి పెద్ద ఎత్తున భక్తులకు ప్రసాదాన్ని పంపిణీ చేశారు.

